

మిరప కాయలను కోస్తున్న కూలీలు

నిలువునా ముంచేశారు..!

- జీబీసీకి నీటి విడుదలలో అలసత్వం
- రైతులు ఆందోళన చేసినా స్పందించని వైసీపీ నాయకులు
- 30 వేల ఎకరాల్లో పంట మట్టిపాలు
- రంగుమారిన మిరప కాయలు.. భారీగా తగ్గిన దిగుబడి
- కోత ఖర్చులు కూడా తిరిగిరాని దుస్థితి



తెల్లగా మారిన మిరపకాయలు

వైసీపీ నేతలపై ఆగ్రహం

సాగునీటి విషయంలో అధికార పార్టీ నాయకులు మోసగించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీబీసీకి మరో 40 రోజులు సాగునీరు వదిలి ఉంటే ఉన్న మిరప కాయలు రంగులు మారేవని, పంట దిగుబడి బాగా ఉండేదని అంటున్నారు. నీటి కోసం రోడ్డెక్కి, ఆందోళనకు దిగామని, దీంతో సాగునీరు ఇస్తామని నమ్మబలికి.. కాలువ కూడా తడవని విధంగా నీటిని విడుదల చేశారని రైతులు వాపోతున్నారు. ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, కేవలం నాలుగు క్వింటాళ్లు వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర సైతం భారీగా పడిపోయింది. గత ఏడాది క్వింటానికి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ ధర లభించింది. ఈ ఏడాది నాణ్యమైన కాయల ధర రూ.15 వేల నుంచి రూ.18 వేలు మాత్రమే పలుకుతోంది.

గిట్టుబాటు లేదు..



నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని మిరప పంటను సాగు చేశాను. కాయలు రంగు మారుతున్న సమయంలో సాగునీరు నిలిచిపోయింది. కనీసం రెండు తడులు నీరు ఇచ్చి ఉన్నా మంచి కాయలు చేతికి వచ్చేవి. మచ్చకాయ, తెల్లకాయలు తగ్గేవి. నష్టాలు కాస్త తగ్గేవి. నాయకులు, రైతులు ఎన్ని పోరాటాలు చేసినా పాలకుల చెవిన పడలేదు.

- ఆర్.భీమలింగ, గడేకల్లు

విడపనకల్లు

జీబీసీ ఆయకట్టు మిరప రైతులు నష్టాలను మూటగట్టుకుంటున్నారు. సకాలంలో సాగునీరు అందకపోవటంతో చేతికి వచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. ఉరవకొండ నియోజకవర్గంలో జీబీసీ ఆయకట్టు, బోరు బావుల కింద దాదాపు 30వేల ఎకరాల్లో మిరప పంటను సాగు చేశారు. మొదటి నుంచి తెగుళ్లు ఆశిస్తుండటంతో పంటను కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడ్డారు. ఇంతలోనే నీటి గండం ఏర్పడింది. నవంబరులోనే సాగునీరు ఆగిపోయింది. దీంతో రైతులకు సాగు నీటి కోసం పోరుబాట పట్టారు. అధికార పార్టీ నాయకులు రైతులను ఏమాత్రం పట్టించుకోలేదు. సాగునీటి విషయంలో రైతులను మభ్యపెట్టారు. దీంతో లక్షల్లో పెట్టు బడులు మట్టిపాలయ్యాయి.

అంతా నష్టమే..



నేను మూడున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశాను. మొక్కలు ఎదుగుతున్న సమయంలో నల్లి పురుగు దెబ్బతీసింది. పురుగును తట్టుకొని పంటలను కాపాడుకుంటే.. సాగునీరు బంద్ అయ్యింది. నానా ఇబ్బందులు ఎదుర్కొని, పంటలను కాపాడుకున్నాము. కోత కూలీ కూడా గిట్టడం లేదు.

- కె.ఓబులేసు, గడేకల్లు



దెబ్బతిన్న కాయలు

రంగుమారే దశలో సాగునీరు లేక మిరప కాయలు తెల్లబారిపోయాయి. మచ్చలు ఏర్పడ్డాయి. దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఫిబ్రవరి మొదటి వారం నుంచి ఎండు మిరపను రైతులు కోస్తున్నారు. ఎకరాలకు ఎకరాలు కోసినా నాలుగు క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. అందులో రెండు క్వింటాళ్లు తెల్లకాయ, మచ్చకాయలు ఉన్నాయి. కోత ఖర్చులు కూడా చేతికి రావడం లేదని రైతులు వాపోతున్నారు. కౌలు రైతులు ఎకరానికి రూ.60 వేల కౌలు చెల్లించారు. ఎరువులకు రూ.20 వేలు, నీటి మందులకు రూ.80 వేలు, కూలీలకు రూ.25 వేలు, విత్తనాలకు రూ.25 వేలు వెచ్చించారు. మొత్తంగా ఎకరానికి రూ.రెండు లక్షలకు పైగానే ఖర్చు చేశారు. దిగుబడి అంతంత మాత్రమే ఉండటం, గిట్టుబాటు ధరలు లేక పోవటంతో రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి కూడా రాదు..



మూడు ఎకరాల్లో డబ్బీ రకం, ఒకటిన్నర ఎకరంలో గుంటూరు కారం కాయలను సాగు చేశాను. డబ్బీలో కోతలు కోయటం ప్రారంభించాను సగానికి పైగా తెల్లకాయలు వచ్చాయి. ఎకరానికి నాలుగు క్వింటాళ్లు వచ్చాయి. అందులో రెండు క్వింటాళ్లు తెల్ల కాయలు ఉన్నాయి. జీబీసీకి నీరు బంద్ కావటమే దీనికి కారణం. ఇంకో నెల రోజులు సాగు నీరు అందించి ఉంటే గట్టెక్కేవాళ్లం. రాస్తారోకోలు, ధర్నాలు చేసినా అధికార పార్టీ నాయకులు పట్టించుకోలేదు. హంద్రీనీవాలో సాగునీరు ఉన్నా ఇవ్వకుండా నిలువునా మోసం చేశారు.

- బి.పర్వతయ్య, ఆర్ కొట్టాల

అధికార పార్టీవారిదే బాధ్యత



ఉరవకొండ నియోజకవర్గ మిరప రైతులు సాగునీటి కోసం రోడ్డెక్కి ధర్నాలు చేశారు. అధికార పార్టీ నాయకులు సాగునీరు ఇస్తామని నమ్మించారు. కాలువ కూడా తడవనంత నీరు వదిలి రైతులను నిలువునా మోసం చేశారు. మిరప కాయలు మంచి రంగు వచ్చే సమయంలో నీరు లేక సగానికి పైగా తెల్లగా మారిపోయాయి. రైతులకు కోత ఖర్చులు కూడా తిరిగిరావడం లేదు. వైసీపీ నాయకులే మిరప రైతులను అప్పుల ఊబిలోకి నెట్టారు. రైతులు రూ.లక్షల్లో పెట్టుబడులను కోల్పోయారు. కొన్ని వంద కోట్ల పంట మట్టిపాలైంది. ఈ పాపం అధికార పార్టీ నాయకులదే.

- పయ్యావుల కేశవ్, ఉరవకొండ ఎమ్మెల్యే

చాలా దారుణం..



జీబీసీకి సాగునీటిని మరో 40 రోజులు సరఫరా చేసి ఉంటే మిరప పంటలో నష్టం ఈ స్థాయిలో ఉండేది కాదు. రైతులు కొంత వరకూ గట్టెక్కేవారు. ఈ 40 రోజులు నీరు లేక పోవటంతోనే కాయలు ఎర్రగా మారలేదు. తెల్లకాయలు, అవీ ఎకరానికి నాలుగు క్వింటాళ్లు కూడా దిగుబడి రాలేదు. సగానికి పైగా తెల్లకాయలు వస్తున్నాయి. వీటిని ఎవరూ కొనరు. కొన్నా.. క్వింటాల్‌కు రెండు మూడు వేలు మాత్రమే ఇస్తారు. ఇంత దారుణమైన పరిస్థితి ఎప్పుడూ రాలేదు. అధికార పార్టీ నాయకులు అన్యాయం చేశారు.

- భీమా, గడేకల్లు



రుద్రంపేట పంచాయతీ కార్యాలయం

"కలెక్టర్ సహా జిల్లాకు సంబంధించిన అందరు ఉన్నతాధికారులు నగరంలోనే ఉంటారు. నగరపాలికలో ఓ కమిషనర్ ఉంటారు. ఒక మేయరు, ఇద్దరు డిప్యూటీలు, యాభైకి గానూ.. 48 మంది అధికార పార్టీ కార్పొరేటర్లు..! ఎమ్మెల్యే కూడా అధికార పార్టీవారే..! అయినా ఏం ప్రయోజనం..? తాగేందుకు గుక్కెడు నీరు ఇవ్వండి మహాప్రభో అని జనం నెత్తీనోరు బాదుకున్నా వినిపించుకోలేదు. నెలల తరబడి సమస్య వేధిస్తున్నా పట్టించుకోలేదు. 'మోటార్లు చెడిపోయాయి..' అని నగరపాలిక యంత్రాంగం అంటోంది. సరిచేయించాల్సిన అవసరం లేదా..? ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత లేదా..? ఇక్కడ ఇంతమంది ఉండగా.. రాష్ట్రస్థాయి అధికారి స్పందించాలనా..? ఇక్కడి అధికారులపై నమ్మకం లేనట్లు.. పొరుగు జిల్లా అధికారిని 'చూసిరాపో.. ఏం జరుగుతోందో..' అని పురమాయించాలనా..?"

అదిలిస్తే.. కదిలారు..!



పీఏబీఆర్ డ్యాంలో మోటార్లను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 28: నగరంలో తాగునీటి సమస్య తీవ్రతపై రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీలక్ష్మి స్పందించారు. వాస్తవ పరిస్థితులు ఏమిటో నివేదించాలని కర్నూలు నగరపాలిక కమిషనర్ భార్గవ్, అనంత నగరపాలిక కమిషనర్ మేఘ స్వరూప్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనాథ్‌రెడ్డిని ఆదేశించారు. దీంతో వారు బుధవారం పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. నీటి నిల్వల గురించి వివరాలు సేకరించారు. అనంతరం నగరంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండే ప్రాంతాలలో పర్యటించారు. ఫెర్రర్ కాలనీ, బుడ్డప్ప నగర్‌లో స్థానికులతో మాట్లాడారు. 'ఇదివరకు రోజుకు గంటైనా వదిలేవారు. ఇప్పుడు అరగంటే వస్తున్నాయి..' అని జనం వాపోయారు. రెండు నెలలకు పైగా సమస్య తీవ్రంగా ఉందని, ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ కార్పొరేటర్లతో కలిసి జనం నగరపాలికను మంగళవారం ముట్టడించారు. మోటార్ల మరమ్మతుకు డబ్బులు లేకపోతే తాము చందాలు వేసుకుని ఇస్తామని మండిపడ్డారు. దీంతో ప్రిన్సిపల్ సెక్రటరీ స్పందించారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరిస్తారా..? లేదా..? వేచి చూడాల్సిందే.

అదీ.. ఇదీ.. నాదే..!

పొరుగు పంచాయతీలో ఇళ్ల నిర్మాణానికి అనుమతి

రుద్రంపేట పంచాయతీలో ఓ ప్రజాప్రతినిధి దూకుడు

లే అవుట్లు, ఇళ్లకు అనుమతి ఇస్తూ.. భారీగా వసూళ్లు

- కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని త్యాగరాజ్ నగర్‌లో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. కక్కలపల్లి గ్రామ పొలం సర్వే నంబరు 25లో ఈ ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. బదులుగా ఓ ప్రజాప్రతినిధి భారీ మొత్తంలో సొమ్ము వసూలు చేశారని ఆ వర్గాలే అంటున్నాయి.
- రుద్రంపేట పంచాయతీలోని మోటూరి ఉదయ్ నగర్ సమీపంలో రెండేళ్ల కిందట మూడు ఎకరాల్లో లే అవుట్ వేశారు. ఈ లే అవుట్‌కు అనుమతులు ఇచ్చేందుకు నాలుగు సెంట్ల ప్లాట్‌ను స్థానిక ప్రజాప్రతినిధి తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది.

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 28: రూరల్ మండలంలోని ఓ స్థానిక ప్రజా ప్రతినిధి 'హద్దులు' దాటుకుని మరీ అక్రమాలకు పాల్పడుతున్నారు. 'ఆడా నీనే.. ఈడా నీనే.. అడిగేదెవ్వరు..?' అన్నట్లు దూసుకుపోతున్నారు. తన పంచాయతీ పరిధి దాటి, పక్క పంచాయతీలోని లే అవుట్లకు, ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇస్తున్నారు. సాధారణంగా ఇంటి నిర్మాణం, లే అవుట్లకు పంచాయతీ అధికారి అనుమతులు తీసుకోవాలి. అహుడా పరిధిలో అయితే అహుడా అధికారుల నుంచి అనుమతి పొందాకే లే అవుట్లు వేయాల్సి ఉంటుంది. ప్రజా ప్రతినిధులకు అనుమతులు ఇచ్చే అధికారం ఉండదు. కానీ ఆ ప్రజాప్రతినిధి ఇవేమీ పట్టించుకోవడం లేదు. అంతా తానే అన్నట్లుగా అనుమతులు ఇచ్చేస్తున్నారు. అనుమతులు ఇచ్చేందుకు భారీగా ముడుపుడులు పుచ్చుకుంటున్నారని సమాచారం. పక్క పంచాయతీ, పక్క మండలం పరిధిలోకి స్థలాలు వస్తాయని తెలిసినా అనుమతులు ఇవ్వడం.. ఆయన అక్రమాలు ఏ స్థాయిలో ఉన్నాయో చెప్పకనే చెబుతోంది. నగరానికి అత్యంత సమీపంలోని రుద్రంపేట పంచాయతీలో ఈ తంతు సాగుతోంది.

పొరుగు పంచాయతీలలో..

ఇళ్ల నిర్మాణం ఏ పంచాయతీలో చేపట్టాలనుకుంటే.. ఆ పంచాయతీ కార్యదర్శి నుంచి అనుమతి పొందాలి. కానీ రుద్రంపేటలో మాత్రం ఆ నిబంధన అమలు కావడం లేదు. కార్యదర్శి అనుమతి లేకుండా, ఓ ప్రజా ప్రతినిధి అనుమతులు ఇస్తున్నారు. అదికూడా, పక్క పంచాయతీ పరిధిలోని ఇళ్ల నిర్మాణానికీ అనుమతులు ఇచ్చేస్తున్నారు. కక్కలపల్లి గ్రామ పొలం సర్వే నంబరు 1 నుంచి 33 వరకు, సర్వే నంబరు 331 నుంచి 333 వరకు ఉన్న ఇళ్లకు కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలో అనుమతులు పొందాలి. రుద్రంపేట పంచాయతీ పరిధిలో ఇళ్లు కక్కలపల్లి గ్రామ సర్వే నంబరు 35 నుంచి మొదలు అవుతాయి. అయితే రుద్రంపేటలోని ఆ ప్రజాప్రతినిధి మాత్రం కక్కలపల్లి కాలనీ పరిధిలోని సర్వే నంబరు 25లో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. రుద్రంపేట పంచాయతీ అనంతపురం మండలంలోకి వస్తుంది. కక్కలపల్లి కాలనీ అనంతపురం రూరల్ మండల పరిధిలోకి వస్తుంది. రుద్రంపేటలో ఆ ప్రజాప్రతినిధి తన పంచాయతీ, మండలాన్ని దాటి మరీ అనుమతులు ఇస్తుండటం గమనార్హం.



ప్రజాప్రతినిధి పేరిట ఇచ్చిన అనుమతి పత్రం

అనంతలో నీటి సమస్య పట్టదా..?

\- గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్



అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 28: అనంతపురం నగరంలో 15 రోజుల నుంచి తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా...పాలకులు పట్టించుకోవడం లేదని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ మండిపడ్డారు. బుధవారం అనంతపురం లోని తన క్యాంపు కార్యాల యంలో మాట్లాడుతూ.. నగరంలో నీటి సమస్యలపై వైసీపీ కార్పొరేటర్లు, నాయకులే నిరసన వ్యక్తం చేసినా ఎమ్మెల్యే, మేయర్లకు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత కనీసం ప్లేట్లు కడుక్కోనేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాము సొంత డబ్బులతో పలు ప్రాంతాలు, పాఠశాలల్లో నీటి సమస్యను తీరుస్తుంటే పాలకులు ఏం చేస్తున్నారని నిలదీశారు. ఇప్పటికైనా నీటి సమస్యను తీర్చకపోతే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణ చేసే పార్టీకే ఓటు: మందకృష్ణ



మందకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గుత్తి, ఫిబ్రవరి 28: ఎస్సీ వర్గీకరణ చేసే పార్టీకే ఓటు వేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ.. మాదిగలకు సూచించారు. అనంతపురం రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో బుధవారం ఆయన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో వైసీపీ ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణ కోసం మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఏబీసీ వర్గీకరణ సుప్రీం కోర్టులో విచారణలో ఉందని అన్నారు. వర్గీకరణకు మద్దతు తెలిపే పార్టీకే ఓటు వేస్తామని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకురాలు సునీత, జిల్లా ఇన్‌చార్జి ఈశ్వరయ్య, జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్, ఎంఎస్‌పీ కదిరప్ప, నరసింహులు, శంకర్, గంగాధర్, పెద్దరాజు, ఆదినారాయణ, పాల్గొన్నారు.

ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

పేకాట ఆడుతూ పట్టుబడిన సుబ్బరాజు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 28: పేకాటలో పట్టుబడిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాజును ఎస్పీ అన్బురాజన్ సస్పెండ్ చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు. బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలో కొందరు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు మంగళవారం సాయంత్రం సమాచారం అందింది. ఎస్పీ ఆదేశాల మేరకు బుక్కరాయసముద్రం సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దాడులు నిర్వహించి, 17 మందిని అదుపులోకి తీసుకుంది. వారి నుంచి రూ.31,600 నగదు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సుబ్బరాజు కూడా ఉన్నారు. నిందితులపై ఏపీ గేమింగ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని ఎస్పీ తెలిపారు. శాఖాపరమైన చర్యలలో భాగంగా హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. పోలీసు వ్యవస్థకు చెడ్డపేరు తెచ్చేవిధంగా ఎవరు వ్యవహరించినా చర్యలు తప్పవని ఎస్పీ స్పష్టం చేశారు.

ఫిర్యాదులను వేగంగా పరిష్కరిస్తాం

జేఎన్‌టీయూలో కౌంటింగ్ కేంద్రాలు

కలెక్టరు గౌతమి



మాట్లాడుతున్న కలెక్టరు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 28: ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదుల క్లెయిమ్స్ పరిష్కారానికి వేగంగా చర్యలు చేపడుతున్నామని కలెక్టరు గౌతమి అన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఆమె కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ఓటరు సవరణలో వచ్చిన ఫిర్యాదులను పక్కాగా పరిశీలిస్తున్నామని తెలిపారు. ఫారం 6, 7, 8 క్లెయిమ్స్‌ను ఎన్నికల నిబంధనల మేరకు పరిష్కరిస్తున్నామని అన్నారు. ఫారం 7కు సంబంధించి మృతులు, డూప్లికేట్ ఓటర్లను పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓటర్ల ఎపిక్ కార్డులు ఇప్పటికి 2.20 లక్షలు వచ్చాయని, పోస్టు ద్వారా ఓటర్ల ఇళ్లకు పంపిస్తున్నామని తెలిపారు. మిగిలిన కార్డులు మరో మూడురోజుల్లో వస్తాయని, వెంటనే వాటిని ఓటర్లకు పంపిస్తామని తెలిపారు. పత్రికలలో వ్యతిరేకవార్తలు వస్తే, నిజమా.. కాదా అని పరిశీలించిన తరువాతనే చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జేఎన్‌టీయులో కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్స్ ఏర్పాటు చేశామని కలెక్టరు తెలిపారు. మొత్తం మూడు బ్లాక్‌లలో ఎనిమిది నియోజకవర్గాలకు కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జేఎన్‌టీయూ మెయిన్ బిల్డింగ్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో తాడిపత్రి, మొదటి ఫ్లోర్‌లో రాయదుర్గం, గుంతకల్లు, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉరవకొండ, మొదటి ఫ్లోర్‌లో శింగనమల, కళ్యాణదుర్గం, ఈసీఈ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో అనంతపురం అర్బన్, మొదటి ఫ్లోర్‌లో రాప్తాడు నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్స్ ఏర్పాటు చేశామని వివరించారు. పార్లమెంటు నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఒక కేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల కమిషన్ ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపామని తెలిపారు. రాజకీయపార్టీల ప్రతినిధులు జేఎన్‌టీయూకు వచ్చి పరిశీలించి, సూచనలు చేయాలని ఆమె కోరారు. సమావేశంలో డీఆర్వో రామక్రిష్ణరెడ్డి, డిప్యూటీ కలెక్టరు విశ్వనాథ్ పాల్గొన్నారు.

యోగా టీచర్లకు జీతాలివ్వండి

ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్



మాట్లాడుతున్న సంతోష్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 28: 'బుద్ధా ఫౌండేషన్' యోగా టీచర్లకు జీతాలు చెల్లించి న్యాయం చేయాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయూష్ డిపార్టుమెంట్ ద్వారా 2022లో గుంటూరుకు చెందిన సయ్యద్ వలి అనే వ్యక్తి బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్‌ను స్థాపించారని, చాలా మంది నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు తీసుకుని శిక్షణ ఇచ్చి ఉద్యోగాలిచ్చారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1700 మంది వరకూ ఆ ఫౌండేషన్ ద్వారా పాఠశాలల్లో నియమితులయ్యారని తెలిపారు. మొదట రూ.34 వేలు జీతం ఇస్తామని చెప్పారని, ఆ తరువాత రూ.25 వేలు ఇస్తామని ప్రకటించారని అన్నారు. కానీ ఐదారు నెలలపాటు కొందరికి రూ.17 వేలు మాత్రమే చెల్లించారని అన్నారు. ఆ తరువాత ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని చెబుతూ.. యోగా టీచర్లకు ఆరు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని అన్నారు. బాధితులు గట్టిగా అడిగితే.. ఫౌండేషన్ నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆవేదన చెందుతున్నారని అన్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే చంపుతామని బెదిరిస్తున్నారని అన్నారు. యోగా ఫౌండేషన్ సభ్యుల నుంచి నిరుద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు మోహన్‌కృష్ణ, శ్రీనివాసులు, శ్రీకాంత్, స్వామి పాల్గొన్నారు.

అద్దె ఇవ్వలేదని సచివాలయానికి తాళం



సచివాలయానికి తాళం వేసిన దృశ్యం

బెళుగుప్ప, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలోని రెండో సచివాలయానికి భవన యజమాని బుధవారం తాళం వేశారు. అధికారులు 34 నెలల నుంచి అద్దె చెల్లించలేదని, అడిగినా పట్టించుకోవడం లేదని భవన యజమాని నాగమ్మ వాపోయారు. నెలకు రూ.7,712 ప్రకారం అద్దె బకాయి ఉన్నారని, నెల రోజుల క్రితం కూడా సచివాలయానికి తాళం వేశామని ఆమె అన్నారు. అప్పట్లో రూ.30 వేలు చెల్లించారని, మిగిలిన మొత్తాన్ని 20 రోజుల్లో చెల్లిస్తామని చెప్పి ఇంతవరకు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈవోఆర్డీ మాధవరెడ్డి వెళ్లి ఆమెతో మాట్లాడారు. వారం రోజుల్లోగా రూ.50 వేలు చెల్లిస్తామని నచ్చజెప్పడంతో ఆమె తాళం తెరిచారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కరెంటు కట్..!



కరెంటులేని అంగన్‌వాడీ కేంద్రం

నంబులపూలకుంట, ఫిబ్రవరి 28: మండలకేంద్రంలోని ఈడిగబజారులోని అంగన్‌వాడీకేంద్రానికి కరెంటు బిల్లు చెల్లించకపోవడంతో కరెంట్ కట్ చేశారు. మూడుసంవత్సరాలుగా కరెంటు లేకుండానే, కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. కేంద్రానికి రూ.20వేలు కరెంటు బకాయి బిల్లులున్నాయి. బకాయిలు చెల్లించకపోవడంతో సరఫరా నిలిపివేశారు. ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో, చిన్నారులు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది చిన్నారులను కరెంటు లేకపోవడంతో కేంద్రానికిపంపలేదని పలువురు తల్లిదండ్రులు చెబుతున్నారు. కరెంటు బిల్లుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, బిల్లులు వస్తాయని చెబుతున్నారని, వచ్చిన వెంటనే బిల్లులు చెల్లించి, సరఫరా తీసుకుంటామంటామని అంగన్‌వాడీ కార్యకర్త చెబుతున్నారు.

రైతు భరోసా విడుదల

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 28: రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాల కింద మూడో విడతలో జిల్లాలో 2,94,353 మంది రైతులకు రూ50.01 కోట్ల విడుదలైనట్లు కలెక్టరు గౌతమి తెలిపారు. బుధవారం తాడేపల్లి నుంచి సీఎం ఈ సొమ్మును విడుదల చేశారన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టరు మాట్లాడుతూ ఒక్కొక్క రైతుకు రూ.2 వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. అలాగే 2021-22 ఖరీఫ్‌కు సంబంధించి రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన 83,534 మంది రైతులకు రూ17.25 కోట్లు లబ్ధి చేరిందన్నారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి పీజీ, ఎంఏ పరీక్షలు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 28: ఎస్కేయూ ఆధ్వర్యంలో గురువారం నుంచి పీజీ, ఎంఏ విద్యార్థులకు ప్రథమ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ బుధవారం ప్రకటనలో తెలిపారు. బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీ, గణితం, రూరల్ డెవలప్‌మెంట్, పొలిటికల్ సైన్స్, తెలుగు, ఇంగ్లీష్ విభాగాల విద్యార్థులు కొంతమంది టెట్ రాస్తున్నారని, వారికి టెట్ తరువాత పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

టెట్‌కు 235 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 28: జిల్లాలో రెండో రోజైన బుధవారం టెట్ పరీక్షలకు 235 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని విద్యాశాఖాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా సాగినట్లు తెలిపారు.

2, 3తేదీల్లో క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

అత్యాధునిక వాహనం హిందూపురానికి రాక

టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

హిందూపురం, ఫిబ్రవరి 28: పట్టణంలో మార్చి 2, 3 తేదీల్లో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రికి ఇటీవలే క్యాన్సర్ నిర్ధారణ చేసే అత్యాధునిక వాహనం తెప్పించారన్నారు. రెండు రోజులపాటు ఆ వాహనాన్ని నియోజకవర్గ ప్రజల కోసం తీసుకొస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవల జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యుల వద్దకు వచ్చిన రోగులకు క్యాన్సర్ అని అనుమానం వచ్చి ఉంటే వారిని హిందూపురానికి పంపాలని కోరారు. ఈ వాహనంలో చేసే పరీక్షలు చాలా ఖర్చుతో కూడుకున్నవని అయినా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వసుంధరదేవి ఇక్కడికి పంపుతున్నట్లు తెలిపారు.

చెన్నకేశవులుకు ఘన నివాళి

రామగిరి, ఫిబ్రవరి 28: కుంటిమద్ది మాజీ సర్పంచ్, రిటైర్డ్ ఐఏఎస్ లక్ష్మీనారాయణ సోదరుడు కొడిదల చెన్నకేశవులు ఘాట్‌కు పలువురు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఆయన సంస్మరణ సభను నిర్వహించారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బంధువులు, శ్రేయోభిలాషులు ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. చెన్నకేశవులు అలంకరించిన పదవులు, చేసిన ప్రజా సేవను గుర్తు చేసుకున్నారు. పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.



చెన్నకేశవులు ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

ఒకరి అరెస్టుతో సరి..!

- శ్రీకృష్ణపై దాడి కేసును పట్టించుకోని పోలీసులు
- పది రోజులు గడిచినా పురోగతి లేదు.. అరెస్టులు లేవు
- ప్రత్యేక బృందాల ఏర్పాటు ఉత్తిదే అని అనుమానాలు
- విపక్షాలు, ప్రజాసంఘాలు ఆందోళన చేసినా స్పందన కరువు
- మిద్దె ఎర్రిస్వామి బెయిల్ కోసం వైసీపీ లీగల్ సెల్ ప్రయత్నాలు
- మిగిలినవారి ముందస్తు బెయిల్‌కు పోలీసుల సహకారం..?



అశోక్



బండి రవి

అనంతపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అది దేశ వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన సంఘటన. అమానవీయ ఘటన. భావ ప్రకటన స్వేచ్ఛపై వైసీపీ మూకలు చేసిన మూకుమ్మడి దాడి అది. పదిరోజుల క్రితం రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో వైసీపీ నిర్వహించిన సిద్ధం సభలో, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు క్రూరంగా దాడికి పాల్పడ్డాయి. విచక్షణ కోల్పోయి హత్యాయత్నానికి ఒడిగట్టారు. శ్రీకృష్ణపై జరిగిన దాడి అమానవీయమని పోలీసు యంత్రాంగం సైతం పేర్కొంది. ఆ మేరకు దుండగులపై కేసు నమోదు చేశారు. దాడిచేసినవారి ఫొటోలు, వివరాల సహా ఆంధ్రజ్యోతి కథనాలను ప్రచురించింది. ఫొటోలు, వివరాలు బహిర్గతం కాగానే పోలీసులు స్పందించారు. హుటాహుటిన నిందితుల్లో ఒకరైన మిద్దె ఎర్రిస్వామిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి నిందితుడికి రిమాండ్ విధించారు. ఆ తరువాత పోలీసు యంత్రాంగం పట్టించుకోవడం మానేసింది. మిగిలినవారిని అరెస్టు చేయడంపై శ్రద్ధ పెట్టడంలేదన్నది నిర్వివాదాంశం.

క్రూరమైన దాడిపై స్పందన ఇదేనా..?

శ్రీకృష్ణపై దాడి కేసు దర్యాప్తును పోలీసు యంత్రాంగం జాప్యం చేస్తోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. అన్ని వర్గాల ప్రజల్లోనూ ఇదే చర్చ జరుగుతోంది. శ్రీకృష్ణపై దాడికి పాల్పడింది ఎవరో వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది. అయినా పోలీసులు ఒకరి అరెస్టుతోనే సరిపెట్టారు. దాడికి పాల్పడిన వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసు యంత్రాంగం చెబుతోందేగాని.. చేతల్లో చూపడం లేదన్న విమర్శలను ఎదుర్కొంటోంది. శ్రీకృష్ణపై దాడికి పాల్పడినవారు అధికార పార్టీ నేతల అనుచరులు అయినందుకే అరెస్టు చేయడం లేదన్న సందేహాలు ప్రతి ఒక్కరి మదిలోనూ మెదులుతున్నాయి. అధికార పార్టీ ముఖ్యుల ఒత్తిళ్ల నేపథ్యంలోనే జిల్లా పోలీసు యంత్రాంగం నిందితులను అరెస్టు చేసేందుకు సాహసించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించామని జిల్లా పోలీసు యంత్రాంగం ప్రకటించింది. ఆ బృందాలు నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. పదిరోజులుగా ఒక్కరినీ అరెస్టు చేయకపోవడంతో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారా..? లేదా..? అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. శ్రీకృష్ణపై దాడికి పాల్పడినవారు వైసీపీ ముఖ్య నాయకుల రక్షణలోనే ఉన్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. 'మా నాయకుల చెంతన ఉన్నాం. మమ్మల్ని ఎవరు అరెస్టు చేసేది..?' అని స్థానికులతో నిందితులు అంటున్నారు. అహంకార ధోరణిని ప్రదర్శిస్తున్నారు. పోలీసులకు సవాలు విసురుతున్నారు. వైసీపీ మూకల క్రూరమైన దాడి పట్ల పోలీసుల స్పందన ఇదేనా..? అని సామాన్య ప్రజలు సైతం విస్తుపోతున్నారు. అధికార పార్టీ ముఖ్యుల ఒత్తిళ్లకు తలొగ్గి, నిందితులకు ముందస్తు బెయిల్‌కు అనువుగా ఉండేలా పోలీసులు అరెస్టు చేయడకుండా ఉన్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

నిరసన గళమెత్తినా..

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని ప్రజాస్వామికవాదులు, వివిధ రాజకీయ పక్షాలు, ప్రజా, కుల, విద్యార్థి, యువజన సంఘాలు ముక్తకంఠంతో ఖండించాయి. దుండగులను అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని నినదించాయి. జర్నలిస్టులు సైతం ఈ దాడిని ఖండిస్తూ పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు నిర్వహించారు. ప్రజాస్వామిక సంఘాలు చర్చలు నిర్వహించాయి. ఎవరు ఎన్నిరకాలుగా ప్రయత్నాలు చేసినా పోలీసులు ఈ కేసును పట్టించుకోవడంలేదు. పోలీసు యంత్రాంగం అన్ని వర్గాల నుంచి విమర్శలు ఎదుర్కొంటోంది. జిల్లా పోలీసు యంత్రాంగం మెతక వైఖరిని ప్రదర్శించడంలో ఆంతర్యమే





దాడిచేస్తున్న వైసీపీ రౌడీమూకలు

మిటో అర్థం కావడం లేదని మేధావివర్గాలు అంటున్నాయి. పోలీసులే బదులివ్వాలని ఆ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

బెయిల్ కోసం రంగంలోకి వైసీపీ లీగల్ వింగ్

శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన వైసీపీ మూకల్లో ఒకరైన మిద్దె ఎర్రిస్వామిని పోలీసులు సంఘటన జరిగిన మరుసటిరోజే అరెస్టు చేశారు. ఆ మరునాడే కోర్టులో హాజరుపరిచారు. అదే సమయంలో నిందితుడి తరుపున అధికార పార్టీ లీగల్ వింగ్ రంగంలోకి దిగింది. రిమాండ్ రిజెక్ట్ పిటిషన్‌ను కోర్టుకు సమర్పించింది. అయితే న్యాయాధికారి ఆ పిటీషన్‌ను తిరస్కరించారు. మార్చి 6 వరకూ రిమాండ్ విధించారు. జిల్లా జైలుకు తరలించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా మిద్దె ఎర్రిస్వామిని బెయిల్‌పై బయటకు తీసుకొచ్చేందుకు అధికార పార్టీ లీగల్ వింగ్ సన్నద్ధమైంది. బెయిల్ పిటిషన్ తయారు చేసే పనిలో నిమగ్నమైంది. శ్రీకృష్ణపై దాడికి పాల్పడినవారిలో ఆరుగురిని పోలీసులు గుర్తించారు. ఆ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ లెక్కన మరో ఐదుగురు నిందితులను అరెస్టు చేయాల్సి ఉంది. కానీ పట్టించుకోవడం లేదు. మిద్దె ఎర్రిస్వామికి బెయిల్ ఇప్పించే ప్రయత్నాలు జరుగుతుండటంతో.. మిగిలినవారి అరెస్టు ఉంటుందా..? లేదా..? అనే సందేహాలు కలుగుతున్నాయి. వారందరూ ముందస్తు బెయిల్‌కు ఏర్పాట్లు చేసుకుంటున్నారని సమాచారం. నిందితులను అరెస్టుచేసి పోలీసులు తమపై వస్తున్న విమర్శలకు బదులు చెప్పుకుంటారా..? అరెస్టు చేయకుండా సహకరిస్తారా తేలాల్సి ఉంది.

ఫైటింగ్‌కు సిద్ధం..!

నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

అమలుగాని తీర్మానాలు, అటకెక్కిన ప్రతిపాదనలు

కాకమీదున్న అధికార పార్టీ జడ్పీటీసీలు ఇతర సభ్యులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 28: 'మేము చేసిన తీర్మానాలు అమలు కావడం లేదు. ప్రజల కోసం అడిగిన పనుల ప్రతిపాదనలు పేపర్లకు పరిమితమయ్యాయి. ప్రొటోకాల్, గౌరవం దక్కడం లేదు..' ఇలా.. అనే అంశాలపై తీవ్ర అసహనంతో ఉన్న జడ్పీటీసీలు, ఇతర పాలకవర్గ సభ్యులు గళం విప్పడానికి సిద్ధమయ్యారు. జడ్పీలో గురువారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశం దీనికి వేదిక కానుంది. జడ్పీలో ఉన్నతాధికారులు తమకు ఏమాత్రం గౌరవం ఇవ్వడం లేదని పలువురు జడ్పీటీసీలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. తమను గంటల తరబడి బయట కూర్చొబెట్టి పంపుతున్నారని ఆగ్రహంతో రగిలిపోతున్నారు. తాగునీటి సమస్యలు, అభివృద్ధి పనులు గురించి నాలుగు నెలల క్రితం ప్రతిపాదనలు సమర్పించారు. ఈ ఫైళ్లకు చెదలు పడుతున్నాయన్న ఆవేదనతో ఉన్నారు. ఇటీవల జడ్పీ సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలు కూడా అమలు కావడం లేదని వాపోతున్నారు. రెండేళ్లుగా తాము ఏ పనులూ చేసుకోలేదని, ఇప్పుడైనా చేసుకుందామని అనుకుంటే ఉన్నతాధికారులు సహకరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారం తమదే అయినా ఏమీ చేసుకోలేని దుస్థితిలో ఉన్నామని అంటున్నారు. మార్చిలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రావడం ఖాయం. ప్రభుత్వం మారితే తమ పరిస్థితి ఏమిటి అని పలువురు జడ్పీటీసీలు ఆందోళనలో ఉన్నారు. అందుకే, ఈ సమావేశం చాలా కీలకమని భావిస్తున్నారు. తమ సమస్యలకు పరిష్కారం, ప్రశ్నలకు సమాధానాలు రాకుంటే తామేమిటో చూపిస్తామని చాలా మంది అధికార పార్టీ జడ్పీటీసీలు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల నడుమ గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఏం జరుగుతుందో అన్న చర్చ నడుస్తోంది.

సొంత డబ్బుతో బోర్లకు మరమ్మతులు

వచ్చే ఎన్నికల్లో విజయం నాదే

తాడిమర్రి నుంచే ప్రచారం మొదలు

మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

ధర్మవరం, ఫిబ్రవరి 28: నియోజకవర్గంలో చాలా బోర్లు, తాగునీటి పథకాల మోటార్లు కాలిపోయాయనీ, వాటికి సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించినట్లు మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. తీవ్ర వర్షాభావంతో నియోజకవర్గంలో భూగర్భజలాలు అడుగంటిపోయి, తాగునీటి బోర్లు ఎండిపోయాయన్నారు. వేసవి కావడంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యపై ఇటీవల జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును కలిసి విన్నవించామన్నారు. కలెక్టర్ కొంతమేర స్పందించి తాగునీటి బోర్లకు మరమ్మతులు చేయించారన్నారు. కాలిపోయిన బోర్లు, మంచినీటి పథకాల మోటార్లకు సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించానన్నారు. ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రజలకు తాగునీరు అందించేందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ బావులకు కనీసం ఐదారు గంటలు కూడా నాణ్యమైన కరెంటు సరఫరా చేయకపోవడంతో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. లో ఓల్టేజీ కారణంగా వందల సంఖ్యలో విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయన్నారు. ఎన్నికలకు ముందు 9 గంటలు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని సీఎం జగన్ గొప్పలు చెప్పి, రైతులను మోసం చేశారన్నారు. రాష్ట్రంలో సైకో పాలన సాగుతుండగా.. ధర్మవరం నియోజకవర్గంలో పాలేగాళ్ల రాజ్యం నడుస్తోందని ఆయన విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాఫియాను ఏర్పాటు చేసుకుని, రూ.4వేల కోట్లు అక్రమంగా అర్జించాడని ఆరోపించారు. రూ.కోట్లు విలువ చేసే భూములను బెదిరించి, తక్కువ ధరకే లాక్కొన్నాడని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో కేతిరెడ్డి ఓట్లు అడిగేందుకు వెళితే గుడ్డలూడదీసి తరిమికొడతారన్నారు. ధర్మవరం అసెంబ్లీ స్థానం నుంచి తాను పోటీ చేస్తాననీ, లక్ష ఓట్ల మెజారిటీతో గెలవబోతున్నానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఆ పాచికలేవీ పారవని స్పష్టం చేశారు. వచ్చేనెల మొదటి వారంలో తాడిమర్రి మండలం నుంచి ప్రచారం ప్రారంభిస్తానన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు డిష్‌రాజు, చిగిచెర్ల అరవిందరెడ్డి, తుంపర్తి పరమేశ్, బోడగల గిరిధర్, దుస్సాక్రిష్ణ, గొట్లూరు చంద్ర, నబీరసూల్, నారాయణస్వామి యాదవ్, చిలకం సూర్యనారాయణరెడ్డి, సరితాల దస్తగిరి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

24 పోస్టులు... 1764 దరఖాస్తులు

అనంతపురం సిటీ, ఫిబ్రవరి 28: రోడ్లు భవనాల శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న వాచ్‌మెన్, ఆఫీస్ సబార్డినేట్, శానిటరీ వర్కర్స్ ఉద్యోగాలకు సంబంధించి 24 పోస్టులకు 1764 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆ శాఖ ఎస్ఈ ఓబుల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి త్వరలోనే మెరిట్ జాబితాను ప్రకటిస్తామని, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన వాటిని భర్తీ చేస్తామని అన్నారు.

అక్రమాల యోగాసనం

- బుద్ధ యోగా ఫౌండేషన్ దందా
- రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్లు, వలంటీర్ల నియామకం
- మధ్యవర్తులతో లక్షల్లో ముడుపుల వసూళ్లు
- ఆయుష్ శాఖ పేరిట నియామక ఉత్తర్వులు
- పాఠశాల విద్యాశాఖ నుంచి ప్రొసీడింగ్స్
- 2021 నుంచి 13 విడతలుగా పోస్టుల భర్తీ
- 1500 మందికి పైగా బాధితులు
- రూ.50 కోట్ల కుంభకోణం?
- కడపలో కలెక్టర్, ఎస్పీకి కొందరి ఫిర్యాదు
- తెరవెనుక వైసీపీ పెద్దలు!

అనంతపురం విద్య, ఫిబ్రవరి 28: రాష్ట్ర విద్యాశాఖలో రూ.కోట్ల కుంభకోణం జరిగినట్లు తెలుస్తోంది. యోగా ఇన్‌స్ట్రక్టర్లు, యోగా వలంటీర్ల ఉద్యోగాల పేరిట ఒక్కో అభ్యర్థి నుంచి రూ.లక్షలు గుంజుకున్నారు. ఈ దందాను 2021లో మొదలు పెట్టారు. బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా పోస్టులు భర్తీ చేసి.. రూ.కోట్లు కొల్లగొట్టారని సమాచారం. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.2 లక్షలు, రూ.3.30 లక్షలు, రూ.4 లక్షలు.. ఇలా అందినకాడికి వందల మంది నుంచి వసూలు చేశారు. అనంతరం వీరిని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో యోగా ఇన్‌స్ట్రక్టర్లు, యోగా వలంటీర్లుగా నియమించారు. ఇన్‌స్ట్రక్టర్లకు రూ.25 వేలు, వలంటీర్లకు రూ.15 వేలు జీతం ఇస్తామని చెప్పడంతో నిరుద్యోగులు క్యూకట్టారు. అడిగినంత లంచాన్ని మధ్యవర్తులకు ముట్టజెప్పారు. ఇలా ఎంపికైన వారికి నియామక పత్రాలను ఇచ్చారు. ఉద్యోగం వచ్చిందని ఆశగా స్కూళ్లలో చేరిన వారికి నెలల తరబడి జీతాలు లేవు. దీంతో తాము మోసపోయామని గుర్తించిన బాధితులు పలు ప్రాంతాల్లో పోలీసులను ఆశ్రయిస్తున్నారు. కడప జిల్లాలో కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతపురం జిల్లాలోనూ ఈ తరహా కేసులు వెలుగు చూశాయి. రాష్ట్ర వ్యాప్తంగా రూ.50 కోట్ల వరకు ఈ స్కాం జరిగినట్లు తెలిసింది. ఈ స్కాం సహా బుద్ధ యోగా ఫౌండేషన్ వెనుక అధికార పార్టీ కీలక నేతలు ఉన్నారని సమాచారం.

విడతల వారీగా ఉద్యోగాలు

రాష్ట్ర వ్యాప్తంగా బుద్ధా యోగా హెల్త్ ఫౌండేషన్ పేరుతో నిరుద్యోగులకు వల వేశారు. కేంద్ర ప్రభుత్వం, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగాలు ఇస్తున్నామని నమ్మించారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నుంచి అనుమతి ఉన్నట్లు నమ్మించారు. దీంతో అనంతపురం, కదిరి, పుట్టపర్తి, కడప ప్రాంతాలకు చెందిన వందల మంది నిరుద్యోగులు ఈ ఉద్యోగాల కోసం తరలి వచ్చారు. చాలా మంది నిరుద్యోగులు 2022, 2023 జనవరి, ఫిబ్రవరి నెలల్లో బ్రోకర్లకు లక్షల రూపాయలు చెల్లించారు. వీరికి 2023 జూన్, జూలైలో నియామక పత్రాలు ఇచ్చారు. కానీ, 2021 నుంచే విడతలవారీగా నియామకాలు జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు 13 విడతల్లో ఈ పోస్టులను భర్తీ చేశారని బాధిత టీచర్లు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా 13వ బ్యాచ్‌లో 13 బ్యాచ్-ఏ, బ్యాచ్-బీ, బ్యాచ్-సీ, బ్యాచ్-డీ పేరుతో కూడా నియామకాలు చేపట్టి.. అందినకాడికి డబ్బులు లాగినట్లు సమాచారం. ఈ పోస్టులకు సంబంధించి 13వ బ్యాచ్ చివరిదని చెప్పి.. 13వ బ్యాచ్ కింద నాలుగు విడతల్లో నిరుద్యోగుల నుంచి డబ్బులు గుంజినట్లు తెలుస్తోంది. మొదట్లో ఉద్యోగాల్లో చేరిన వారికి 4 నెలలు, 6 నెలలు జీతాలు చెల్లించారు. ఆ తర్వాత పైసా కూడా ఇవ్వలేదు. 2023, జూన్ 26న నియమితులైన 12వ బ్యాచ్ వాళ్లకు ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు.

రూ.50 కోట్ల పైమాటే...

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో సుమారు 300 మంది ఉద్యోగాల్లో చేరారు. కడప జిల్లాలో 74 మంది ఉన్నారని బాధితులు చెబుతున్నారు. కడపకు చెందిన ఓ మహిళ రూ.3 లక్షలకు పైగా చెల్లించారు. 2023, జనవరి 3వ వారంలో ఆమె మధ్యవర్తికి డబ్బు చెల్లించారు. అదే ఏడాది ఏప్రిల్‌లో ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు. కానీ, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా జీతం ఇవ్వలేదు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఓ మహిళ 2023, ఫిబ్రవరిలో రూ.2 లక్షలు చెల్లించారు. అదే ఏడాది జూన్‌లో ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు. ఏడు నెలలు గడిచినా జీతం చెల్లించలేదు. అనంతపురం జిల్లాకు చెందిన ఓ యువకుడు రూ.2 లక్షలు చెల్లించాడు. 2022 జులైలో అతనికి పోస్టింగ్ ఇచ్చారు. కానీ జీతం చెల్లించలేదు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 1500 మంది వరకు బాధితులు ఉన్నట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా ఈ కుంభకోణం నడిచినట్లు తెలుస్తోంది.



బుద్ధ యోగా ఫౌండేషన్ పేరిట ఇచ్చిన ఐడీ కార్డులు

అంతా మాయ..

బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ పేరిట జరిగిన తతంగం మొత్తం ఓ మాయలా కనిపిస్తోంది. 2022 జూలైలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ పేరిట ప్రొసీడింగ్స్ వచ్చాయి. యోగా ఇన్‌స్ట్రక్టర్లను విధుల్లో చేర్చుకోవాలని, ప్రత్యేక హాజరు నమోదు చేయాలని సూచించారు. యోగా శిక్షణ ఉచితంగానే ఇస్తారని పేర్కొన్నారు. వీరి భర్తీ ప్రక్రియను మొత్తం బుద్ధ యోగా ఫౌండేషన్‌వారే చూసుకున్నారు. పోస్టుల భర్తీ వ్యవహారాన్ని బహిరంగపరచకుండా, లోలోపలే తతంగం నడిపించారు. గుంటూరులోని బ్రాడిపేటలో దీని కార్యాలయం ఉందని, 45 రోజుల శిక్షణ కోసం తమను అక్కడికి పిలిపించి, 60 రోజులు అక్కడే ఉంచారని బాధితులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే విడతలవారీగా లంచం చెల్లింపులు జరిగాయి. కొందరు ఫోన్ పే, మరికొందరు నగదు రూపంలో డబ్బులు చెల్లించామని చెబుతున్నారు. వీరందరికీ గవర్నమెంట్ ఆఫ్ ఏపీ, బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ పేరిట ఐడీ కార్డులు ఇచ్చారు. ఆయుష్ శాఖ కమిషనర్ పేరిట నిమాయక ఉత్తర్వులు ఇచ్చారు. ఇదిలావుంటే, జిల్లాల విద్యాశాఖ అధికారులకు వీరి నియామకంపై సమాచారమే లేదని తెలిసింది. కొందరు ఎంఈఓలకు మాత్రం మౌఖికంగా తెలుసునని సమాచారం.

బుద్ధ యోగా పేరిట..

ఉద్యోగాల భర్తీ అంతా బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ పేరుతో నడిచినట్లు స్పష్టమవుతోంది. ఈ ఫౌండేషన్ వెనుక వైసీపీ నాయకులు, పెద్ద తలకాయలే ఉన్నట్లు సమాచారం. పోలీసులు తీగ లాగితే ఈ కుంభకోణం డొంక కదులుతుందని బాధితులు చెబుతున్నారు. అయితే, అధికార పార్టీ పెద్దల హస్తం ఉందని తెలుస్తుండడంతో పోలీసులు చొరవ చూపడం అనుమానమేనని అంటున్నారు.

ఉత్సాహంగా జాతీయ సైన్స్ డే...!

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : జాతీయ సైన్స్ దినాన్ని నగరం, మండల కేంద్రాల్లోని పలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తాము తయారు చేసిన పలు నమూనాలను ఇందులో ప్రదర్శించారు. ఉపాధ్యాయులు సైన్ దినోత్సవంతోపాటు సర్ సీవీ రామన్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఎస్కేయూలో భువన విజయ ఆడిటోరియంలో విద్యార్థులు పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. వాటిని వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య పరిశీలిం చారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రక్తగ్రూపు నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని చైర్మన్ అనంతరాముడు ప్రారంభించారు.



మాంటిస్సోరి స్కూల్‌లో సందడి


శ్రీచైతన్య స్కూల్‌లో విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి


సరస్వతీ విద్యానికేతన్‌లో..., సాయి విజ్ఞాన్ పాఠశాలలో...


శ్రీవాణి స్కూల్‌లో నమూనాలతో చిన్నారులు


ఆజాద్‌నగర్‌లోని నవభారత్ పాఠశాలలో...


ఎస్కేయూలో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న వీసీ హుస్సేన్‌రెడ్డి


నవోదయ కాలనీలోని గిరిజన గురుకుల పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేవీవీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆచార్య రాచపాళెం, నాయకులు


చియ్యేడు ఉన్నత పాఠశాలలో విద్యాసామగ్రిని అందజేస్తున్న అతిథులు


రాప్తాడు ఉన్నత పాఠశాలలో సర్ సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


గొళ్లపల్లిలో టీడీపీ నాయకుల ప్రచారం

బాబుతోనే అన్నివర్గాల సంక్షేమం

రాప్తాడు, ఫిబ్రవరి 28: చంద్రబాబుతోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని, కావున టీడీపీని గెలిపించి.. మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రి చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని గొళ్లపల్లి, పెసరకుంట గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిం చారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి టీడీపీ పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్థులు టీడీపీ నాయకులు వద్ద వాపోయారు. కార్యక్రమంలో కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వామి, సాకే జయరాముడు, చిరంజీవి, కొత్తపల్లి నారాయణస్వామి, రాధాకృష్ణ, చంద్రశేఖర్, భాస్కర్, నరసింహులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో టైలర్స్ డే

అనంతపురం అర్బన్ : అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో బుధవారం ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి కుమారుడు మధుకర్ చౌదరి కేక్ కట్ చేసి టైలర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో టీఎన్‌టీ యూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీ నరసింహులు, నాయకులు జేఎం బాషా, ముత్యాలు, పూలబాషా, సాయికుమార్, శివాజీ, వన్నూరు, శీనా, ఉమాదేవి, వాణి, రాధిక, పార్వతి, నాగరాజు, బాబావలి, స్వామి, మురళీ, కమ్మగిరి పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న మధుకర్ చౌదరి

3న విద్యుత్ విశ్రాంత ఉద్యోగుల సమావేశం

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 28 : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు దేవదాసు ప్రకటనలో తెలిపారు. అనంతపురం పవర్ ఆఫీస్ ఆవరణంలో 10 గంటలకు నిర్వ హించే ఈ సమావేశంలో 75సంవత్సరాలు పూర్తి చేసుకున్న సభ్యులను సన్మానిస్తామని, విశ్రాంత ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

రేపటి నుంచే ఒంటిపూట బడులు నిర్వహించాలి

అనంతపురం విద్య : ఎండలు అధికంగా ఉన్నాయని, మార్చి 1 నుంచే ఒంటిపూట బడులు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ఈ చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

చీనీ కాయలు టన్ను రూ.18వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 28: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ18,500, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.14 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్ కు మొత్తంగా 148 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

కేంద్ర పథకాలను హైజాక్ చేస్తున్న వైసీపీ

రామగిరి, ఫిబ్రవరి 28: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల సంక్షేమపథకాలను రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం పేరు మార్చి.. వారి పార్టీ.. సీఎం ఫొటోలతో ప్రచారం చేసుకుంటోందని బీజేపీ నాయకులు విమర్శించారు. బుధవారం మండలంలోని పేరూరు, కొండాపురం, ఎంసీపల్లి, నసనకోట తదితర గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపోరు యాత్రలో బీజేపీ నాయకులు మాట్లాడారు. రాబోవు ఎన్నికల్లో కుటుంబ పార్టీలకు స్వస్తి పలికి అవినీతి లేని బీజేపీకి మద్దతుపలకాలని కోరారు. కార్యక్రమంలో రాప్తాడు అసెంబ్లీ కన్వీనర్ రావి చైతన్య కిశోర్, ప్రజాపోరు కన్వీనర్ పాలెం కాటమయ్య, ఓబీసీ జిల్లానేత కోడి రామ్మూర్తి, రామగిరి మండల కన్వీనర్ శ్రీనాథ్, ఆత్మకూరు తోపుదుర్తి ప్రకాశ్, శివ, చెన్నకేశవనాయుడు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో పద వినోదం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో రోజువారి బ్యాంకింగ్‌కు సంబంధించిన పదాలు, ఆర్థిక అంశాలతో ఆర్‌బీఐ పరీక్ష పత్రాన్ని విద్యార్థులకు అందజేశారు. మార్చి 1న నిర్వహించే వారోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేస్తామని ఎల్‌డీఎం సత్యరాజ్, నోడల్ రిసోర్స్ సెంటర్ కో-ఆర్డినేటర్ లక్ష్మీకాంత తెలిపారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగాధిపతి రంగనాథ్, కెనరాబ్యాంకు అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రాప్తాడు, ఫిబ్రవరి 28: మండలంలోని యర్రగుంటలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అదుపులోకి తీసుకున్నామని రాప్తాడు సీఐ మునిస్వామి బుధవారం తెలిపారు. అతని నుంచి 100 టెట్రా ప్యాకెట్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

భవన నిర్మాణ కార్మికులకు వైసీపీ అన్యాయం


ధర్నాలో మాట్లాడుతున్న వెంకటనారాయణ

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 28: రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసి.. వారికి తీరని అన్యాయం చేస్తోందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటనారాయణ మండిపడ్డారు. అన్యాయాన్ని ప్రశ్నిద్దాం పిలుపులో భాగంగా అనంతపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు అమలు అవుతున్న సంక్షేమ పథకాలను నిలిపివేయడం దుర్మార్గమన్నారు. 12, 14 మెమోను రద్దు చేయాలన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నాగభూషణం, భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, గ్రానైట్ టైల్స్ కట్టర్స్ యూనియన్ నాయకులు ఎర్రిస్వామి, కార్పెంటర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, రాడ్ బెండర్స్ యూనియన్ నాయకులు సూర్యనారాయణ పాల్గొన్నారు.

జాబ్‌మేళా విజయవంతం

అనంతపురం సెంట్రల్ : ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైనట్లు వైస్ చైర్మన్ చక్రధరరెడ్డి పేర్కొన్నారు. హరిష్‌కుమార్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఐటీ, బీపీఓ, ఫార్మా, బ్యాంకింగ్, ఉత్పత్తి తదితర సంస్థల ప్రతినిధులు హాజరై విద్యార్థులు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. సుమారు 650 మందితో షార్ట్‌లిస్ట్ చేశారని, అందులో 350 మంది విద్యార్థులకు తక్షణ ఎంపిక పత్రాలు అందజేశారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మదుసూధనరెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్, కళాశాల చైర్మన్ సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

అనంతపురం రూరల్: మండలంలోని ఆకుతోటపల్లిలో రోడ్డు ప్రమాదాలు-జాగ్రత్తలు, ట్రాఫిక్ నియామాలపై ఎస్కేయూ క్యాంప్ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం-1 ఆధ్వర్యంలో అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. రాధ స్కూల్, సేతు స్కూల్, ఆకుతోటపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద మూకాభినయ ప్రదర్శన నిర్వహిం చారు. ఇందులో శ్రీకృష్ణదేవరాయ ఫార్మా స్యూటికల్ సైన్‌సెస్ ప్రిన్సిపాల్ సోమశేఖర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సౌమ్య పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 28: స్థానిక పీటీసీ ఆవరణంలో కొత్తగా నిర్మించిన కామితార్థద మహాగణపతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను బుధవారం నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం తలకాడులోని బాలకృష్ణానంద మహాసంస్థానాధిపతి గోవిందానంద సరస్వతి స్వామి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. గర్భాలయంలో యంత్రప్రతిష్ఠాపన, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అనంత రం ఆలయ ఆవరణంలో ప్రతిష్ఠ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.


వేడుకలో గోవిందానంద సరస్వతి స్వామి, అలంకరణలో స్వామి

మట్కా బీటర్ల అరెస్ట్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 28 : సిండికేట్ నగర్‌లో మట్కా రాస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం అరెస్ట్ చేసినట్లు అనంతపురం రూరల్ సీఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.18,700 స్వాధీనం చేసుకున్నామన్నారు.

వాహనం ఢీకొని జింక మృతి



చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 28: మండలంలోని బసినేపల్లి క్రాస్ వద్ద బుధవారం రోడ్డు దాటుతున్న జింకను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అది తీవ్రంగా గాయపడింది. స్థానికులు గమనించి ఆ జింకను రోడ్డు పక్కకు తరలించి పోలీసులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రామగిరి ఈస్ట్ ఫారెస్టు బీట్ ఆఫీసర్ గౌతమి, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పుల్లప్ప, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే అది మరణించినట్లు గుర్తించారు. ఆ జింకకు నాలుగు సంవత్సరాల లోపు వయస్సు ఉంటుందని గౌతమి తెలిపారు. ఎన్‌ఎస్ గేటులోని పశువైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని జింక కళేబరాన్ని దహనం చేశారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 28: స్థానిక మరువకొమ్మ కాలనీకి చెందిన కూలీ సాకే రాజు (40) బుధవారం విద్యుదాఘాతానికి గురై మరణించాడు. నగరంలోని అరవిందనగర్‌లో ఓ ఇంటి ఎదుట ఫ్లెక్సీ కట్టడానికి సాకే రాజు, అశోక్‌నగర్‌కు చెందిన సలీమ్ వెళ్లారు. ఫ్లెక్సీ కడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో ఇద్దరూ విద్యుదాఘాతానికి గురై కిందపడ్డారు. వారిపై ఫ్లెక్సీ బోర్డు పడింది. గమనించిన స్థానికులు ఫ్లెక్సీని తొలగించి పరిశీలించగా... సాకే రాజు అప్పటికే మరణించినట్లు గుర్తించారు. గాయపడ్డ సలీమ్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాకే రాజు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రాజుకు భార్య, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉందాం


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రామగిరి, ఫిబ్రవరి 28: ఎన్నికల సమయం సమీపిస్తోందని, అందరం అప్రమత్తంగా.. సమష్టిగా పనిచేసి టీడీపీని గెలిపిద్దామని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో మండల నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్‌కన్వీనర్‌లు, సాధికార సారధులతో సమావేశం నిర్వహించారు. ఇందులో టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి చంద్రన్నను ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోను వివరించాలన్నారు. వైసీపీ దౌర్జన్యాలు, అవినీతి, ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కంటిమద్ది రంగయ్య, మండల కన్వీనర్ సుధాకర్, సీనియర్ నాయకుడు రామ్మూర్తినాయుడు, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, తెలుగు యువత శ్రీధర్‌నాయుడు, బైటిన్ సురేంద్ర, మాదాపురం శంకర్, పోతన్న, పరంధామ, నసనకోట ఎంపీటీసీ శ్రీనివాసులు, షణ్ముక, రాము, వెంకటరాముడు పాల్గొన్నారు.

పరీక్షల వేళ హాల్ టిక్కెట్ల ఒత్తిడి తగదు: టీఎన్‌ఎస్‌ఎఫ్


మీడియాతో మాట్లాడుతున్న టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 28: ఇంటర్ పరీక్షల వేళ విద్యార్థులపై యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని హాల్ టికెట్లు ఇవ్వకుండా ఒత్తిడి చేయడం సరికాదని టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు మండిపడ్డారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం, జిల్లా అధ్యక్షుడు గుత్తా ధనుంజయనాయుడు, రాష్ట్ర నాయకులు లక్ష్మి నరసింహ మాట్లాడారు. 1వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ఉన్నా యని, అయితే కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ యాజ మాన్యాలు పూర్తి ఫీజు చెల్లిస్తేనే హాల్‌టికెట్ ఇస్తామంటూ విద్యార్థులను వేధిస్తున్నాయని అన్నారు. అలాంటి కాలేజీలపై ఆర్‌ఐఓ కార్యాలయ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి శివ, అనిల్ పాల్గొన్నారు.

చీనీ రైతులను ఆదుకోవాలి


చీనీచెట్లను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

గార్లదిన్నె, ఫిబ్రవరి 28: చీనీ రైతులను తక్షణమే ఆదుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నెరమెంట్ల యల్లన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ముకుందాపురం గ్రామంలో నీరులేక ఎండుతున్న చీనీచెట్లను పరిశీలించారు. ముకుందాపురం గ్రామంలో సుమారు వెయ్యి మంది రైతులు చీనీచెట్లను సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. హెచ్‌ఎల్సీ కాలువకు నీరు రాకపోవడం, చెరువులలో నీరు లేకపోవడం, భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో నీరు లేక చెట్లు ఎండుముఖం పట్టాయన్నారు. వాటిని కాపాడుకునేందుకు అన్నదాతలు పడుతున్న కష్టాలు అన్నిఇన్ని కావన్నారు. చీనీచెట్లకు ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి ముకుందాపురం గ్రామంలో పర్యటించి మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా చీనీ తోటలకు నీరు సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎస్సీ, ఎస్టీ ఫోరం రాష్ట్ర నాయకులు మీసుగా రామాంజినేయులు, మాజీ ఎంపీటీసీ రవిరాజు, కోదండ రాముడు, రవిశంకర్, ఎర్రిస్వామి, రైతులు ఉన్నారు.

మర్తాడులో చోరీ

గార్లదిన్నె: మండలంలోని మర్తాడు గ్రామంలో మంగళవారం రాత్రి తీగం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. మర్తాడుకు చెందిన ఉసేన్ కూలిపనులు చేసుకుంటు జీవనం సాగించేవారు. అతను కుటుంబ సభ్యులతో కలిసి అనంతపురానికి వెళ్లారు. దీంతో మంగళ వారం రాత్రి దొంగలు అతని ఇంట్లో చొరబడి రూ. 50 వేలు నగదు, వెండి, బంగారు అభరణలు ఎత్తుకెళ్లారు. అదే గ్రామంలో బాబా, వెంకటేసు ఇళ్లల్లోకి చొరబడి... తాళాలు పగలకొట్టే ప్రయత్నం చేశారు.స్థానికులు కేకలు వేయడంతో దొంగలు పారిపోయారు. పోలీసులు బుధవారం ఉదయం ఆ ఇళ్లను పరిశీలించారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.

టీడీపీ సానుభూతిపరుడికి నివాళి

అనంతపురం రూరల్: మండలంలోని కామారుపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు నాగమణి ఆనారోగ్యంతో బుధవారం మరణించాడు. విషయం తెలుసుకున్న పలువురు మండల నాయకులు అతని మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబానికి పరామర్శించారు. వారిలో మండల కన్వీనర్ జింకసూర్యనారాయణ, తెలుగు రైతు రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షుడు నారాయణస్వామి, కుమ్మర రామాంజినేయులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎల్లప్ప, నాయకులు పరశురాముడు, కురవ నారాయణస్వామి ఉన్నారు.

శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాలకు ఐసీఏఆర్ గుర్తింపు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 28: మండలంలోని ఆలమూరులోని శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాలకు జాతీయస్థాయిలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) గుర్తింపు లభించినట్లు శ్రీబాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ పేర్కొన్నారు. బుధవారం ఆ కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 2029 వరకు ఐసీఏఆర్ గుర్తింపు ఇచ్చిందని, ఈ గుర్తింపు దక్కడం సంతోషంగా ఉందని అన్నారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది కృషి వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె సింధూర, కళాశాల అసోసియేట్ డీన్ రవీంద్రనాథరెడ్డి, ఏఓ శ్రీనివాసులురెడ్డి, విశ్రాంత కేరళ డీజీపీ శంకర్‌రెడ్డి, కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ఎన్ఎన్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు సుబ్బారావు, మన్మథేశ్వరరెడ్డి, రమేష్, వైభవ్ పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న చైర్మన్ పల్లె కిశోర్

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించండి

అనంతపురం అర్బన్: కేంద్ర ప్రభుత్వ ర్యాంప్ పథకంలో భాగంగా చేపట్టనున్న ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించాలని పరిశ్రమల శాఖ జీఎం నాగరాజారావు బుధవారం ప్రకటనలో కోరారు. పరిశ్రమల శాఖ ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో క్షేత్ర స్థాయిలో సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్వే కోసం ఎంఎస్ఎంఈ సర్వే అండ్ సపోర్ట్ అనే మొబైల్ యాప్‌ను రూపొందించారన్నారు. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అమెనిటీ సెక్రటరీలు ఈ సర్వే చేస్తారన్నారు. ఈ సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లో అన్ని ఎంఎస్ఎంఈల సర్వే చేసి వాటిని డిజిటల్ ప్లాట్ ఫాంలోకి తీసుకొచ్చి, ఏపీ ఎంఎస్ఎంఈ వన్ పోర్టల్‌కు అనుసంధానం చేస్తామన్నారు. ఇందులో నమోదు కాని వ్యాపారాలను ఉద్యం, ఉద్యమ అసిస్ట్‌లో నమోదు చేయడం ఎంఎస్ఎంఈ ఫార్మలైజేషన్ ముఖ్యఉద్దేశమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎంఎస్ఎంఈ అసోషియేషన్లు, ఇతర పరిశ్రమల అసోషియేషన్లు, వర్తక, వాణిజ్య సంఘాలు సర్వే బృందాలకు సహకరించాలని కోరారు.

ఫలితాలు ఏకపక్షం: కాలవ



ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

రాయదుర్గంటౌన్, ఫిబ్రవరి 28: ఎన్నికల నేపథ్యంలో ప్రజలు సునామీ లాగా టీడీపీ, జనసేన కూటమిలో చేరుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఏకపక్షంగా టీడీపీ, జనసేన కూటమికి అనుకూలంగా ఫలితాలు రాబోతున్నట్లు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని 15 వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన కూటమి 165 స్థానాల్లో విజయం సాధించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కూటమి విజయం తథ్యమని నిరూపించడానికి తాడేపల్లి సభ నిదర్శనమని వ్యాఖ్యానించారు. వైసీపీ అభ్యర్థులను ప్రకటించడంలో ముఖ్యమంత్రి జగన్ అయోమయానికి గురవుతున్నట్లు చెప్పారు. జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరేగౌడ మంజునాథ్, మాజీ వైస్ చైర్మన్లు కడ్డిపూడి మహబూబ్‌బాషా, నల్లపూలు వెంకటేశులు, కౌన్సిలర్ ప్రశాంతి, మాజీ కౌన్సిలర్లు బండి భారతి, సంపత్‌కుమారి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి రాజు, నాయకులు పూజారి తిప్పయ్య, కోదండ, వెంకటస్వామినాయుడు పాల్గొన్నారు.

గోమూత్రంతో కమిషనర్ చాంబర్ శుద్ధి



కమిషనర్ చాంబర్‌ను శుద్ధిచేస్తున్న కౌన్సిలర్లు

తాడిపత్రి, ఫిబ్రవరి 28: అధికారపార్టీకి కొమ్ముకాస్తూ ఏకపక్షంగా వ్యవహరించిన కమిషనర్ రవి బదిలీపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం టీడీపీ కౌన్సిలర్లు ఆయన చాంబర్‌ను గోమూత్రంతో శుద్ధిచేశారు. అంతకుమునుపు బూడిద గుమ్మడికాయతో మున్సిపల్ కార్యాలయానికి దిష్టితీశారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు సరస్వతి, అబ్దుల్‌రహీం, టీడీపీ కౌన్సిలర్లు విజయ్‌కుమార్, షెక్షావలి, మల్లికార్జున, అరుణ, రేష్మాపర్వీన్ పాల్గొన్నారు.

తాడిపత్రి కమిషనర్‌గా రాంమోహన్

తాడిపత్రి, ఫిబ్రవరి 28: మున్సిపల్ నూతన కమిషనర్‌గా రాంమోహన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రవి ఆముదాలవలసకు బదిలీపై వెళ్లారు. పలువురు మున్సిపల్ అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

గుమ్మఘట్ట ఉన్నత పాఠశాల తనిఖీ



పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ

గుమ్మఘట్ట, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం డిప్యూటీ డీఈఓ శ్రీదేవి తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆమె తనిఖీ చేసి మౌలిక వసతులు, తాగునీటి సరఫరా, మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించారు. పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో తాగునీరు లేక డ్రైనేజీ నీరు వినియోగిస్తుండడంతో ఆంధ్రజ్యోతిలో ఏమిటీ ఈ దౌర్భాగ్యం అనే శీర్షికన కథనం వెలువడింది. దీంతో కలెక్టర్ గౌతమి సీరియస్‌గా పరిగణించి పాఠశాలను తనిఖీ చేసి చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో తనిఖీ చేసినట్లు ఆమె వెల్లడించారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యం పట్ల విద్యార్థులకు ఇలాంటి పరిణామాలు దారి తీశాయని, దీనిపై ఆ రోజు విధుల్లో ఉన్న హెడ్ మాష్టర్‌తో పాటు ఉపాధ్యాయులు రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆమె ఆదేశించారు. మీరు రాసిచ్చిన వివరణ ఆధారంగానే కలెక్టర్ చర్యలు ఉంటాయని తెలిపారు. ఆమె వెంట ఎంఈఓ-2 రామచంద్ర ఉన్నారు.

టీడీపీ నాయకుల సమావేశం



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

యల్లనూరు, ఫిబ్రవరి 28: మండలంలోని గొడ్డుమర్రి గ్రామంలో బుధవారం టీడీపీ నాయకులు పుల్లయ్య ఇంటిలో సమావేశమయ్యారు. పార్టీ గెలుపుకోసం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా పార్టీ సభ్యులు వాసాపురం నరేంద్రనాయుడు, మండల తెలుగుయువత అధ్యక్షుడు శరత్‌చంద్రనాయుడు, శింగవరం మాజీ సర్పంచు మోహన్‌నాయుడు, కల్లూరు వీరభూషణ్‌నాయుడు, మల్లికార్జుననాయుడు పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి



చీనీతోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త తిరుపతి

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 28: రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఎంటమాలజీ శాస్త్రవేత్త తిరుపతి అన్నారు. బుధవారం ఆయన మున్సిపల్ పరిధిలోని గూబనపల్లిలో మామిడి, చీనీ తోటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. మామిడి పిందెలు రాలకుండా ప్లానోఫిక్స్ 2.5 ఎంఎల్ పది లీటర్ల నీటికి కలుపుకుని పిచికారి చేస్తే ఫలితం ఉంటుందన్నారు. మామిడి నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు ఫ్రూట్ కవర్స్ తొడిగితే పండు ఈగ, కాయ తొలుచు పురుగు నివారించుకోవచ్చని తెలిపారు. దీని వల్ల నాణ్యమైన పంటను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, ఉద్యాన శాఖ అధికారి కృష్ణ తేజ, గౌసియా, రైతులు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్ట్

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 28: పట్టణంలోని గర్ల్స్‌హైస్కూల్ సమీపంలో జనవరి 3న సయ్యద్ ఆరిఫ్‌ను హత్యచేసిన కేసులో బుధవారం నిందితుడు ఖాదర్‌బాషాను అరెస్ట్ చేసినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. నిందితున్ని కోర్టుకు హాజరుపరచగా రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

తాగునీటి సరఫరా బంద్



తాగునీటి కోసం ట్యాంక్ వద్ద ఉంచిన బిందెలు

పెద్దవడుగూరు, ఫిబ్రవరి 28: మండలంలోని దిమ్మగుడి గ్రామంలో సత్యసాయి పథకం ద్వారా గ్రామానికి వచ్చే తాగునీరు పైపుల మరమ్మతు కారణంగా వారంరోజులుగా బంద్ అయ్యాయి. గ్రామంలో ఉన్న బోరుబావి నీరు వాడుకుంటున్నా ఉప్పునీరు కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోయారు. సంబంధిత అధికారులు పైపులైనుకు మరమ్మతు చేయించి తాగునీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

విద్యార్థులు భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని పలువురు వక్తలు అన్నారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వక్తలు మాట్లాడుతూ ప్రపంచ దేశాలతో నేడు భారతదేశం పోటీ పడుతోందన్నారు. రోదశీ రంగంలో శాస్త్రవేతల కృషిని కొనియాడారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



గుంతకల్లు: గెలుపొందిన విద్యార్థులతో ఆర్డీఓ, జేవీవీ సభ్యులు



యాడికి: సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు



ఉరవకొండలో విద్యార్థులు ఏర్పాటు చేసిన నమూనాలు



పామిడి: నమూనాల ప్రదర్శన



తాడిపత్రి: సైన్స్ నమూనాను తిలకిస్తున్న పద్మవాణి పాఠశాల కరస్పాండెంట్ నాగపీరయ్య



కళ్యాణదుర్గం: నమూనాలను ప్రదర్శిస్తున్న శ్రీచైతన్య విద్యార్థులు



కుందుర్పి: సీవీ రామన్ చిత్రపటం వద్ద ఉపాధ్యాయుల నివాళి



బెళుగుప్పలో నమూనాలను తిలకిస్తున్న హెచ్‌ఎం వెంకటప్రసాద్

ప్రమాదవశాత్తు వృద్ధుడి మృతి

పెద్దపప్పూరు, ఫిబ్రవరి 28: మండలకేంద్రానికి చెందిన చాకలి ఓబులేసు (70) అనే వృద్ధుడు బుధవారం ప్రమాదవశాత్తు మృతిచెందినట్లు ఎస్‌ఐ శరత్‌చంద్ర తెలిపారు. ఓబులేసు దుస్తులు ఉతికేందుకు మండలకేంద్రంలోని పెన్నానది ఒడ్డుకు వెళ్లాడు. ఆ సమయంలో ఫిట్స్‌రావడంతో ప్రమాదవశాత్తు నదిలోకి పడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి అన్న కుమారుడు వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటోమెకానిక్ బంకు దగ్ధం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 28: పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో టీవీ స్టేషన్ వద్ద ఆటోమెకానిక్ బంకులో బుధవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో బంకు పూర్తిగా దగ్ధమైంది. స్థానిక రామిరెడ్డి కాలనీకి చెందిన భాస్కర్‌రావు ఆటో మెకానిక్‌గా టీవీ స్టేషన్ సమీపంలో బంక్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మధ్యాహ్నం భోజనం కోసం బంక్ బంద్ చేసి ఇంటికి వెళ్లాడు. బంక్ వెనుక పడి ఉన్న చెత్తను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. ఆ మంటలు వ్యాపించి బంక్‌కు అంటుకున్నాయి. మంటలు వ్యాపించడంతో స్థానికులు గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. ప్రమాదంలో రూ.50వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

నాటుసారా విక్రేత అరెస్ట్

యాడికి, ఫిబ్రవరి 28: నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్న వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దపేట రోడ్డులో ఉన్న సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీ వద్ద యాడికికి చెందిన బత్తిన నాగేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి సారా తయారుచేసుకొని తీసుకువచ్చి విక్రయిస్తుండగా సిబ్బందితో దాడిచేసి, అతని వద్ద నుంచి 9లీటర్ల సారా సీజ్‌చేశామన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 28: కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. మండల పరిధిలోని చాపిరి గ్రామ సమీపంలో టెట్రా ప్యాకెట్లు విక్రయిస్తున్నారని సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు దాడి చేసి వారి నుంచి వంద టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.5 వేలు వుంటుందని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెద్దపప్పూరు, ఫిబ్రవరి28: మండలంలోని చాగల్లు గ్రామశివారులో బుధవారం 9 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.24700 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ శరత్‌చంద్ర తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి 9మందిని అరెస్ట్‌చేసి కేసు నమోదు చేశామన్నారు.

ఫ్యాక్షన్ వీడి.. ప్రశాంత జీవనం గడపండి

పెద్దవడుగూరు, ఫిబ్రవరి28: ఫ్యాక్షన్ వీడి ప్రశాంత జీవనం గపడాలని సీఐ రోషన్, ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని మేడిమాకులపల్లి గ్రామంలో బుధవారం వారు నాకాబందీ నిర్వహించారు. రౌడీషీటర్లు, అనుమానితుల గృహాల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ సమస్యలు ఉంటే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసి సామరస్యంగా పరిష్కరించుకోవాలని కోరారు.

యల్లనూరు: మండలంలోని నిట్టూరులో బుధవారం ఉదయం నాకాబందీ నిర్వహించినట్లు ఎస్‌ఐ గిరిబాబు తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యల దృష్ట్యా ఇరువర్గాలకు చెందిన గృహాల్లో సోదాలు నిర్వహించామన్నారు. సోదాల్లో ఎటువంటి మారణాయుధాలు లభ్యంకాలేదని ఆయన తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 28: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిమి రామాంజనేయులు డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు బుధవారం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఆసుపత్రికి వచ్చే ఎమర్జెన్సీ రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నాయకులు రాఘవేంద్రప్రసాద్, రంగన్న, వాసం రవిబాబు, సత్యరంగయ్య, రవీంద్ర, వీరేష్, త్రిలోక, కృష్ణ పాల్గొన్నారు.

నాలుగు కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం



పట్టుకున్న వెండి ఆభరణాలను చూపుతున్న పోలీసులు

విడపనకల్లు, ఫిబ్రవరి 28: మండలంలోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నాలుగు కిలోల వెండి ఆభరణాలు, రూ.98 వేలను విడపనకల్లు పోలీసులు బుధవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. విడపనకల్లు ఎస్‌ఐ ఖాజా హుస్సేన్ తెలిపిన వివరాలు మేరకు బళ్లారి నుంచి అనంతపురం మీదుగా తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన శంకర్ అనే వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా నాలుగు కిలోల వెండి, రూ.98 వేలు నగదును కర్ణాటక బస్సులో తరలిస్తున్నాడని తెలిపారు. సరిహద్దు చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా వాటిని పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసి వీటిని ఐటీ శాఖ అధికారులకు బదిలీ చేసినట్లు తెలిపారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి



శ్రీచైతన్య స్కూల్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 28: ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో స్కూలు ఎదుట బుధవారం నాయకులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న కార్పొరేట్ స్కూళ్లపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తాలుకా అధ్యక్షులు మహమ్మద్, ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, పట్టణ కార్యదర్శి హర్షవర్ధన్, సహాయ కార్యదర్శి అజయ్, పవన్, జయంత్ బాలు, అనిల్, చిదానంద, సిద్దు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

రాయదుర్గం, ఫిబ్రవరి 28: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రతి ఒక్కరికీ ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని రిటర్నింగ్ ఎన్నికల అధికారి కరుణకుమారి సూచించారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈఆర్ఓ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన నూతన ఓటర్లు ఎన్నికల సమయం వరకు ఫారం సిక్స్‌ను దరఖాస్తు చేసుకొని ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. రాజకీయనాయకులు మాట్లాడుతూ బీఎల్ఓలు కొంతమంది దరఖాస్తులను తీసుకోవడం లేదని వాపోయారు. బీఎల్ఓలు పనిచేయకపోతే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. గుమ్మఘట్ట డీటీ రఘు, ఈడీటీ సుజాత, టీడీపీ నాయకుడు పసుపులేటి రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జయన్న, సీపీఐ నాగార్జున, ఆమ్‌ఆద్మీ వెంకటరమణ బాబు పాల్గొన్నారు.

దుకాణాల్లో పోలీసుల తనిఖీలు

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 28: పట్టణంలోని వడ్డే కాలనీ, వాల్మీకి సర్కిల్‌లో పలు దుకాణాల్లో సీఐ హరినాథ్ ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు చేపట్టారు. ఎక్కడైనా అక్రమ మద్యం, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

కౌన్సిలర్‌కు పరామర్శ



కౌన్సిలర్‌తో మాట్లాడుతున్న మందక్రిష్ణ మాదిగ

తాడిపత్రి, ఫిబ్రవరి 28: టీడీపీ కౌన్సిలర్ మల్లికార్జున యోగక్షేమాలను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందక్రిష్ణమాదిగ అడిగి తెలుసుకున్నారు. గతంలో వైసీపీ శ్రేణుల దాడిలో కౌన్సిలర్ గాయపడ్డ విషయం తెలిసిందే. పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో ఉన్న కౌన్సిలర్‌ను కలిసి ఆరోగ్యం, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

తగ్గిన చింతపండు ధరలు

రాయదుర్గం, ఫిబ్రవరి 28: పట్టణంలోని మార్కెట్‌లో బుధవారం నిర్వహించిన వేలంలో చింతపండు ధర తగ్గినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల నుంచి రైతులు చింతపండును అమ్మకానికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఫ్లవర్ రకం రూ.5,600 నుంచి రూ.8,300 వరకు ధర పలికిందన్నారు. అదే విధంగా కరిపులి రకం రూ.9,300 నుంచి రూ.16,300 వరకు పలికినట్లు తెలిపారు.

ఘనంగా టైలర్ల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న టైలర్ల సంఘం నాయకులు

ఉరవకొండ, ఫిబ్రవరి 28: పట్టణంలో ప్రపంచ టైలర్ల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. టైలర్లు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం టైలర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థిక సహాయాన్ని అందించాలన్నారు. సంఘం నాయకులు నగేష్, కృష్ణమూర్తి, సుధాకర్, మహమ్మద్, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

కణేకల్లు: మండల టైలర్స్(దర్జీ) నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టైలర్‌డే సందర్భంగా స్థానిక చిక్కణ్ణేశ్వర దేవాలయం వద్ద టైలర్లు సమావేశమయ్యారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా చిక్కణ్ణ, అధ్యక్షులుగా బాషా, ఉపాధ్యక్షులుగా ఖాసీం, కార్యదర్శిగా వీరేష్, జాయింట్ సెక్రెటరీగా అస్లెన్, కోశాధికారిగా వన్నూరుస్వామి, పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైభవంగా సీతారామాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పుట్లూరు, ఫిబ్రవరి28: మండలంలోని రంగమనాయునిపల్లి గ్రామంలో బుధవారం సీతారామాంజనేయస్వామి, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. గోపూజ, జలాధివాసం, ప్రత్యేక పూజలు చేపట్టారు. గురువారం విగ్రహాల ప్రతిష్ఠతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

రేపు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ

విడపనకల్లు, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలో టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై శుక్రవారం సాయంత్రం 3 గంటలకు పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ బీడా మారయ్య తెలిపారు. కార్యక్రమానికి టీడీపీ మండల నాయకులు అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

యాడికి, ఫిబ్రవరి 28: పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ వైద్యుడు శ్రీరాంకుమార్, పరమేశ్వర్, దేవరాజ్, అప్పయ్య కోరారు. బుధవారం యాడికిలోని సమావేశ భవనంలో పోలియో సిబ్బందికి శిక్షణా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 3వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

తాగునీటి సమస్య రానివ్వకండి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 28: రాబోయే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని టీడీపీ కౌన్సిలర్ కే కృపాకర్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. కృపాకర్ మాట్లాడుతూ ధర్మవరం గేట్ వద్ద ఆరు నెలల క్రితం పైప్‌లైన్ కోసం పెద్ద గుంత తవ్వారని, ఆ గుంతలో పడి చాలా మంది గాయపడ్డారని, వెంటనే మూసివేయాలన్నారు. ధర్మవరం గేట్ వద్ద డ్రైనేజీ సమస్య ఉందని పనులను చేపట్టాలన్నారు. వైసీపీ కౌన్సిలర్లు సుమోబాషా, విద్యారాణి మాట్లాడుతూ వార్డుల్లో తరచూ పైప్‌లైన్ లీకేజీల వల్ల తాగునీరు వారానికోకసారి వస్తున్నాయన్నారు. వాటర్ ట్యాంక్‌లు పంపమని అడిగితే పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గులాంషా ఖాద్రీ గంధం



గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న మత పెద్దలు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 28: పట్టణంలోని పోర్టర్‌లైన్‌లో వెలసిన హజరత్ గులాంషా ఖాద్రీ 64వ ఉరుసు ఉత్సవాలలో భాగంగా బుధవారం గంధం కార్యక్రమాన్ని నిర్వహించారు. వేకువజామున పోర్టర్‌లైన్‌లోని జామియా మసీదు నుంచి గంధంను మేళతాళాల మధ్య ఊరేగింపుగా డీజిల్ షెడ్ రోడ్డు, స్టేషన్‌రోడ్డు, అంజుమన్ వీధి, ధర్మవరం గేట్, టీబీ రోడ్డు, బెంచి కొట్టాల, పోర్టర్‌లైన్ మీదుగా దర్గాకు తీసుకువచ్చారు. అనంతరం గంధంను స్వామి వారికి సమర్పించారు. ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు దర్గాలో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రాయదుర్గం: పట్టణంలోని కొండపై వెలసిన హజరత్ సయ్యద్ జాఫర్ షావలి దర్గా ఉరుసు మహోత్సవం బుధవారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. దర్గా వద్ద నుంచి షంషేర్‌ను గుర్రం మీద ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆత్మకూరు వీధి నుంచి ఊరువాకిలి, వినాయకసర్కిల్, శాంతినగర్ మీదుగా దర్గా వరకు ఉరుసు ఊరేగింపును నిర్వహించారు. దర్గా ప్రాంగణంలో నిర్వహించిన ఖవాలీ ఆకట్టుకుంది. ఉరుసు మహోత్సవంలో మత గురువులు వలిబాషా సాహెబ్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.



షంషేర్ ఊరేగింపు

విధులకు డుమ్మా కొడుతున్న ఉపాధ్యాయులు

● పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

గుమ్మఘట్ట, ఫిబ్రవరి 28: మండలంలోని గోనబావి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు కొంతమంది తరచూ విధులకు డుమ్మా కొడుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రాథమిక పాఠశాలలో 1, 2 తరగతులలో 132 మంది విద్యార్థులుండగా, ఐదుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయురాలు మీనాక్షి ఉండగా, ఆమెకు హెచ్‌ఎం బాధ్యతలు అప్పగించకుండా విద్యాశాఖ అధికారులు మేరీలతకు అప్పగించడం వివాదాలకు దారితీసింది. దీనిపై ఆంధ్రజ్యోతి బుధవారం పాఠశాలను తనిఖీ చేయగా పాఠశాలలో మీనాక్షి, మురళి మాత్రమే విధుల్లో ఉండగా దేవేంద్ర కొద్ది నెలలుగా స్టడీ లీవుపై వెళ్లారు. హెచ్‌ఎం మేరీలత ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికీ అప్పగించకుండా సెలవు చీటి లేకుండా మూడురోజులుగా పాఠశాలకు రావడం లేదు. వనిత కూడా సెలవు చీటి లేకుండా సెలవుపై వెళ్లారు. దీనిపై పాఠశాలలో ఉన్న మీనాక్షి, మురళిలను ఆరాతీయగా తమకేమీ బాధ్యతలు అప్పగించలేదని తెలపడంతో, దీనిపై విద్యాశాఖ అధికారి రామచంద్రను సంప్రదించగా ఆయన కూడా విధులకు డుమ్మా కొట్టిన ఉపాధ్యాయులను వెనకేసుకొస్తూ విధులకు సక్రమంగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు మీనాక్షి పైనే ఆరోపణ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది.



గోనబావి ప్రాథమిక పాఠశాల